# కనబడుట లేదు

మూర్తి కాళ్లు క్రిందికి జారవిడిచి టేబుల్ పైన కూచున్నాడు. శర్మ కూర్చీ వెనుక కాళ్ల ఆసరాతో గోడపైకి వ్రాలిపోయి కాళ్లను టేబిల్ పైకి బారగిల జాపాడు. శాస్త్రి కుర్చీలో విగ్రహమై పోయి, తాంబూలచర్వణం వల్ల లభిస్తున్న ఆనందంలో తన్మయుడై పోతున్నాడు.

ఉదయం తొమ్మిది యిరవైకి సరిగ్గా సూర్యం ఆఫీసులో అడుగు పెట్టేసరికి యిదీ పరిస్థితి.

లేదంటే ఒక చిన్న సవరణ, ఎక్కడి వారక్కడ నిశ్చలంగా పత్రికా పఠనంలో నిమగ్నులై వున్నారు.

ఆరోజు దినప్రతిక ఎనిమిది పేజిలు, ఆ ఆఫీసులో పనిచేసే గుమాస్తాలు నలుగురు. నేల నాలుగు చెరగుల పైకి దిగ్విజయార్థం బయలుదేరిన రాకుమారులకు మల్లే, ఆ నలుగురు గుమాస్తాలు నాలుగు వేర్వేరు శాఖలు చెందిన ఫైళ్లతో, రికార్డులతో హోరా హోరిగా పోరాటం సలుపుతారు. (ఇంత ఘనంగా చెప్పుకోవడం యిష్టం లేకపోతే) నాలుగెద్దుల్లా ఆఫీసు గానుగను లాక్కుపోతారు. అసలు రెండేళ్లకు మునుపు లోకంలో అన్ని గానుగల్లాగా, ఈ గానుగను కూడా రెండెద్దులే లాగేవి. తల ప్రాణం తోక కొచ్చి, యిక లాగలేక అవి చదికిలపడి పోబోతుండగా మరొక జతకాడెద్దులు సాయం వచ్చాయి. అనాటినుంచి వెయ్యి బాధ్యతల్నీ, నాలుగైదు హక్కుల్నీ వాళ్లు సమాన ప్రతిపత్తితో పంచుకున్నారు. రోజు కొకరుగా బుక్‌స్టాలునుంచీ, స్వంత డబ్బుతో దినపత్రిక కొనుక్కురావడం ఆ వెయ్యి బాధ్యతల్లో ఒకటి. తెచ్చిన పత్రికను వీలైనన్ని విడి భాగాలుగా చింపి, అందరూ ఒక్కసారిగా పత్రికా పఠనానికి ఉపక్రమించడం ఆ నాలుగైదు హక్కుల్లో ఒకటి.

సూర్యం తనకోసం ఎదురు తెన్నులు చూస్తున్న దినపత్రిక తాలూకు విడి కాగితాన్ని చేతికి తీసుకొని కూర్చీలో కూలబడిపోయాడు.

నలుగురూ నాలుగు శాస్త్రాల్లో పాండిత్యం గడించి, కడకు శాస్త్ర సిద్ధాంతాలు లౌకిక వ్యవహారాలతో అన్వయించకపోవడంచేత పస్తుమాడిన విద్వాంసులు పుక్కిటి కథ ద్వారా లోకానికి చిరపరిచితులు! ఆ విద్వాంసులకు మల్లే సూర్యమూ, అతని సహచరులూ వార్తా పత్రిక ద్వారా లభ్యమౌతున్న విజ్ఞానాన్ని సైతం కొన్ని భాగాలుగా విభజించి, తమ అభిరుచికి అనుగుణంగా ఆ విభాగాల్ని కూడా తమలో తాము పంచుకున్నారు. వాతావరణం, విపణివీధి, వారఫలాలు, శాస్త్రివి - రాష్ట్ర, కేంద్ర శాసన సభా కార్యకలాపాలు నాయకుల ఉపన్యాసాలు - మూర్తివి, సూర్యం విదేశ వ్యవహారాలు, కాగా పోగా పత్రికలో యిక మిగిలేవి ప్రకటనలు. అవి శర్మవి!

"అదొక పనిగా ఎవరైనా ప్రకటనల్ని వరుసబట్టి చదువుతారా" అనుకోగూడదు. ఒకరి సంగతి మనకనవసరం. శర్మమాత్రం సరిగ్గా ఆపనే చేస్తాడు. శర్మ డాక్టర్ కాదు. కానీ ఏ వ్యాధికి ఏమందు బాగా పనిచేస్తున్నదో అతడికి తెలిసినట్టు మరొకరికి తెలియదు. సోపులు, తలనూనెలు, ఫేసుపౌడర్లు, వీటిల్లో ఏది సలీసు, ఏది గిరాకీ, ఏది ప్రశస్తం మున్నగు వివరాలు సర్వే సమస్తం అతడి నాలుక చివరలోనే వుంటాయి. ఉద్యోగావకాశాలకోసం "వాంటెడ్ కాలం" చూడవలసిన అవశ్యకత లేదు, శర్మని కలుసుకుంటే చాలు!

సూర్యం పేపరు చూడ్డానికి ప్రారంభించి యింకా రెండు నిమిషాలు పూర్తికాలేదు. కాళ్లు క్రిందికి దించి కొంచెం ముందుకు జరగడంతో శర్మ కూర్చున్న కుర్చీ గోడనుంచీ ఒక్కవిసురున క్రిందికి వ్రాలి అటూ యిటూ వూగిపోయింది. ఇది ఏదో విశేషాన్ని శర్మ మిత్రులకు ప్రకటించచదలచుకున్నప్పుడు జరిగే తతంగం!

విదేశ వార్తలో కృష్ణమీనన్ని అన్వేషిస్తూ, ఎంతకూ ఆయన కనపడనందుకు ఆశ్చర్యపడుతున్న సూర్యం, ఆర్థిక మంత్రిగారి ఉపన్యాసాన్ని చదివి, అదనపు పన్నుల స్వరూపం ఎలా వుంటుందో తెలియక గింజులాడుకుంటున్న మూర్తి, బంగళాఖాతంలో కలకత్తాకు దగ్గర ఎక్కడో లేచిన సుడిగుండం మదరాసు దాకా ప్రాకివచ్చి నాలుగు ఉబ్బ చినుకులు నేలరాలితే మెట్ట జిల్లాలో సైతం గ్రీష్మతాపం తగ్గవచ్చునని కలలుగంటున్న శాస్త్రి-ముగ్గురూ ఒకేసారి తలపైకెత్తి శర్మవైపు చూచారు.

"గొప్ప బహుమానం, నూరు రూపాయలు ఎవరికి కావాలి?" అన్నాడు శర్మ.

"అప్పటికి నీకు అనవసరమై నట్టు! చాల్లే వూరుకోవయ్యా" అన్నాడు మూర్తి.

"అవసరం, అనవసరం అన్న సంగతలా వుండనిచ్చి,అసలు విషయ మేమిటో చెప్పవోయ్ శర్మా" అంటూ శాస్త్రి శర్మకూ, మూర్తికి మధ్యస్థం నిర్వహించాడు.

జానపద చిత్రాల్లో రాజాజ్ఞను పురజనులకు చదివి వినపించే రాజభటుడిలా శర్మ పెద్ద గొంతుకతో ప్రకటనను చదువసాగాడు.

"కనబడుట లేదు. పేరు నరహరి. వూరు కాకినాడ, వయసు యిరవై ఒకటి, ఎత్తు యించుమించు ఆరడగులు. కోలముఖం, ఎడమ చెంపమీద ఆనపగింజంత పుట్టు మచ్చ. రెండు నెలలకు మునుపు ఇల్లువిడిచి పరారై పోయాడు. తల్లిదండ్రులు కలవరిస్తున్నారు. ఆచూకి తెల్పినవారికి నూరు రూపాయలు బహుమానం"..... శర్మ యిక్కడ కొంతసేపు ఆగి "ఎందుకైనా మంచిది. అందరూ అడ్రసు వ్రాసి వుంచుకోండి. భరణాల సుబ్బరామయ్యగారు, రామాలయం వీధి" అన్నాడు.

"ఏది ఆ ఫోటో నొకసారి చూడనివ్వు" అంటూ సూర్యం పేపరుకోసం చేయిచాపాడు.

కాకినాడ సూర్యానికి అపరిచితమైన పట్టణం గాదు. అది తన అత్తగారి వూరన్నవిషయం అటుండగా, అతడు ఏడెనిమిదేళ్లు ఆ వూళ్లో వుండి చదువుకున్నాడు. అతనికి తెలిసినంతవరకూ ఆ పట్టణంలో యిద్దరు ముగ్గురు సుబ్బరామయ్యలున్నారు. తెలియని వాళ్లు మరి కొందరుండకపోరు. సూర్యం ఆ "కనపడని" నరహరి ఫోటోను అనేక దృక్పథాల్లో నుంచి పరీక్షించి చూచాడు.

చివరకు "ఇతడెవరో నాకు తెలిసిన వ్యక్తి కాదు" అనుకున్నాడు.

సాయంత్రం వీధుల్లో విద్యుద్దీపాలు వెలిగేవేళకు సూర్యం ఇల్లు చేరుకున్నాడు. దుస్తుల్ని వూడదీసి దండెంపైకి విసిరి యెకాయెకిని స్నానాల గదిలో దూరాడు. ప్రొద్దస్తమానమూ కాగితాల్లో పనిచేసిన తర్వాత ఆ ఆఫీసు తలుపులకూ, ఈ గృహ వాతావరణానికీ మధ్యలో వేడినీటి స్నానం ఎంతైనా అవసర మనిపిస్తుంది సూర్యానికి. చెంబుతో ముంచి, దిమ్మతిరిగిన తలపైన నీళ్లను దిమ్మరించుకున్న కొద్దీ సూర్యానికి బ్రతుకెంతో సౌఖ్యదాయక మనిపించింది. ఒళ్ళు తుడుచుకుంటూ సూర్యం బయటికి వచ్చేసరికి పొయ్యిమీదినుంచి ఆఖరు గిన్నెను కిందికి దించుకున్న సుశీల "ఏమండీ! ఒకమాట" అంది.

"మొదట భోజనం, మాటలూ గీటలూ తర్వాత" అన్నాడు సూర్యం.

"నిజమే, నిజమే, మీకు చాలా ఆకలిగానే వుంటుంది. కానీ ఆకలిగా వుందని యింటికొచ్చిన చుట్టాన్ని మరచిపోవడం భావ్యంకాదు. అతిథి దేవుడితో సమానం! డాబాపైన తిరుగుతున్నట్టున్నాడు, పిలవండి" అంది సుశీల.

"చుట్టమా! ఎవరు సుశీలా?" అన్నాడు సూర్యం.

"వెళ్లి చూడండి, తెలుస్తుంది.

తనకు కడుపులో కొక్కులు తవ్వుతుండగా ఎప్పటిలాగే నింపాదిగా మాట్లాడుతున్నందుకు సుశీలమీద సూర్యానికి చిరాకు పుట్టుకొచ్చింది. చిరాకు వెంబడే కోపంగూడా వచ్చింది. కానీ చిరాకునూ, కోపాన్నీ వ్యక్తంచేయడానికి సైతం ఓపికలేక సూర్యం గబగబా మెట్లెక్కసాగాడు.

సంజ వెలుగులు మాసిపోతుండగా దిగుతూ దిగుతూ వున్న చీకటి తెరల్లో పిట్టగోడ కానుకుని క్రిందికి చూస్తున్న వ్యక్తి సూర్యానికి లీలగా కనిపించాడు.

సూర్యం చివరి మెట్టుపైన నిల్చుని, ఆలోచనలో పడ్డాడు. ఇంతకు మునుపు తనెన్నడూ యిలాటి మనిషిని చూచినట్టు జ్ఞాపకం లేదు. అసలతనిది ఏవూరు? ఇతణ్ణి ఏమని పలకరించాలి? ఒక చిటికలో సుశీల తనను యిరకాటంలో పెట్టేసింది. వచ్చిన దారివెంబడే తిరిగి వెళ్లి ఈసారి సుశీలను గట్టిగా అడిగితే యితడెవరో తెలుస్తుంది. ఊహు, తను మరీ అంతచేతగాని వాడనిపించుకోగూడదు. ఇంత చిన్న చిక్కులోనుంచీ బయటపడగలిగినంత మాత్రం లౌకికజ్ఞానం తనకు లేకపోలేదు.....సూర్యం చరచరా ముందుకువెళ్లి "ఏమండీ ఎప్పుడొచ్చారు" అంటూ అతణ్ణి సమీపించాడు.

అతిథి ఉలికిపడ్డాడు.

"నేనా... మరి... ఇంతకు మునుపే వచ్చాను. నాలుగున్నరకు" అని, కాసే పతడు దిక్కులుచూచి "మీరెప్పుడొచ్చారు" అన్నాడు.

సందర్భోచితంగాని ఆ ప్రశ్న తాకిడికి కాస్తా ఆశ్చర్యపడుతూ "నే నిప్పుడే ఆఫీసునుంచీ వస్తున్నాను. రాగానే మీరు వొచ్చారని సుశీల చెప్పింది. చాలా రోజులకు కనపడ్డారు. వూళ్లో అందరూ బాగున్నారుకదండీ?" అన్నాడు సూర్యం.

"బాగున్నారు" అన్నాడు ఆగంతకుడు ముక్త సరిగా.

ఆ తర్వాతేం మాట్లాడాలో సూర్యానికి తోచలేదు. అతడు ఒకటి రెండు నిముషాలసేపు తటపటాయించి "భోజనం చేద్దాంరండి. తరువాత తీరిగ్గా మాట్లాడు కోవచ్చు" అంటూ అతిథిని క్రిందికి తీసుకెళ్లాడు.

ఆకుల్లో అన్నం వడ్డిస్తూ "ఈ అన్నం మా తమ్ముడికి సరిపడదేమోనండీ! ముక్కులు కుట్టుకోడానికి వీలయ్యే సన్నబియ్యమైతే గానీ వీడికి ముద్దదిగదు" అంది సుశీల.

"ఓహో, ఈయనగారు సుశీలకు తమ్ముడి వరుసన్నమాట! కానీ, కానీ యిలాగే వివరాలు బయటపడకపోవు" అనుకుంటూ సూర్యం "చెప్పకుండా చెయ్యకుండా మీ

తమ్ముడిలా ప్రత్యక్షం కాగలడని నాకేం తెలుసు సుశీలా! వస్తాడని తెలిసివుంటే బజార్లన్నీ గాలించి వున్నవాటిల్లో మేలురకం బియ్యం తీసుకురాగలిగి వుండేవాణ్ణి" అన్నాడు. వరుసకతడు తనకు బావమరిదని తెలిసిన తర్వాత సూర్యానికి కాస్త పరాచికాలు విసరడానికి సైతం అవకాశం సమకూరింది.

"అవును మరి! మా తమ్ముడు మీకోసం తన రాకపోకల్ని గురించి పత్రికలో వేయించవలసింది" అంది సుశీల.

"ఈ కూర నీకెలా వుందోయ్" అన్నాడు సూర్యం అతిథివైపు చూస్తూ.

ఈ ప్రశ్నలకు గూడా సుశీలే బదులు చెప్పింది.

"మా పార్వతమ్మ పిన్ని పాకంముందు ఈ కూర దిగదుడుపేగదండీ! బాబాయిగారిల్లు హైస్కూలుకు దగ్గరగా వుందిగదా, నేను స్కూలుకు వెళ్తూ వెళ్తూ అక్కడికి వెళ్లేదాన్ని. పిన్ని నన్ను అన్నం తినందే వదిలిపెట్టేదిగాదు. బలవంతంగా పట్టుకెళ్లి కంచంముందు కూచోబెట్టేది....నువ్వప్పుడల్లా నన్ను అన్నం తిననిచ్చేవాడివా తమ్ముడూ! కంచంలో జొరబడి తినగలిగినంత తిని, మిగిలింది అటూ యిటూ వెదజల్లి దూరంగా పారిపోయేవాడివిగదూ!"

పార్వతమ్మగారి పాక విద్య సంగతి సూర్యానికి తెలియదు. కానీ ఏ కూరతోనైతే అన్నం తింటున్నాడో, ఆ కూర పుణ్యమా అని ఈ అతిథి తమ్ముడు ఆ పార్వతమ్మ పిన్నిగారి కుమరుడని సూర్యానికి తెలిసింది. సుశీల మాటల్లో అప్పుడప్పుడు పార్వతమ్మగారి ప్రస్తావన పొడుసూపుతూ వుంటుంది. "ఎవరు సుశీలా ఆ పార్వతమ్మ పిన్ని" అని సూర్యం ప్రశ్నించడమూ, 'అదేనండీ! సన్నగా, పొడుగ్గా, ఎర్రగా, ఒక పల్లు ఎత్తుగా' అని సుశీల ఆమె ఆకారన్ని వర్ణించి చెప్పడమూ "ఏమోలే, ఈసారెప్పుడైనా కాకినాడ వెళ్లినప్పుడు ఆమెను చూపించు అని సూర్యం ఆ సంభాషణ నంతటితో ముగింపుకు తేవడమూ, ఆ భార్య భర్తల మధ్య తరచూ జరిగే ప్రసంగాల్లో ఒక్కటి.

అసలు విషయం యిది: పార్వతమ్మ సుశీల పుట్టింటి వారికంత దగ్గరి చుట్టంగాదు. అదేదో బీరకాయ పీచు సంబంధం.

దొరికిన వివరాలను ఆధారంగా వుంచుకుని సూర్యం ఈసారి ప్రశ్నల వర్షాన్ని కురిపింపసాగాడు.

"జనార్ధనం వూళ్లోనే వున్నాడా?"

"లేకేం! మొన్న గూడా కనిపించాడే" అన్నాడు అతిథి.

జనార్ధనం సూర్యానికి బావమరిది. సుశీలకంటే నాలుగేళ్లు చిన్నవాడు.

"గ్రామసేవ, సేవాసమితి అంటూ పల్లెటూళ్లు తిరగడం మానేశాడుకుంటాను".

"మానేసినట్టే"

"మామగారు వాడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నామని జాబు వ్రాశారు. ఆ సంగతేమైనా తెలిసిందా నీకు?"

"అబ్బే వాడుద్యోగం దొరికేదాకా పెళ్లి వద్దంటున్నాడు గదండీ!"

"అదేమిటోయ్," నువ్వేలోకంలో వున్నావు?"

సూర్యం ఆశ్చర్యం వెలిబుచ్చి "వాడికి ఉద్యోగం దొరికి నెలరోజులైందే! కొంపదీసి పోస్టింగు ఆర్డరు వచ్చేసిందేమిటి?" అన్నాడు.

బంధువు బిత్తరపోయాడు. అంతలో అతడు పరధ్యానంనుంచీ తేరుకున్న వాడిలా పోజుపెట్టి "ఆ ఆ, ఉద్యోగం దొరికిందిగదూ! ఆ సంగతి నేను మరిచిపోయాను" అన్నాడు.

భోజనాలు పూర్తి కావచ్చాయి.

సుశీల పళ్లెరంలో ఆకులూ వక్కలూ తీసుకొచ్చి హాల్లో టేబిలుపైన వుంచింది.

సూర్యం చుట్టంతో సహా తాంబూలం నమల సాగాడు.

సుశీల విస్తర్లు తీసుకెళ్లి, వీధివైపు మురికి కాలవలో పారవేసి తిరిగివస్తూ "లేక లేక మబ్బు లెక్కుతున్నాయండీ! చల్లగా ఒక్క జడివాన పడిపోతే గానీ ఈ గాలి దూరని మిద్దెటిండ్లల్లో మనం బ్రతకలేము" అంది.

"కాకినాడలో గూడా యిలాగే వుందక్కయ్యా! చినుకు నేలరాలడం లేదు. వడగాలి చెప్పతరంగాదు....

అతని మాటలకు సుడిగాలిలా అడ్డు తగిలి సూర్యం "అయ్యొయ్యో! నువ్వు నిండు చెరువులో నీళ్లే లేదంటా వేమిటి? బయట కుంభవర్షం కురుస్తుండగా నేనీ జాబువ్రాస్తున్నాను అని మామగారు ఉత్తరం వ్రాశారే! నిన్న వచ్చిన ఉత్తరమే సుశీలా! మీ నాన్నగారు వుత్త పుణ్యానికి అబద్ధాలు వ్రాయరుగదా!" అన్నాడు.

అతిథి కుర్చీనుంచి లేచి గబగబా ద్వారందాకా వెళ్లి తాంబూలం వుమ్మివేసి సుశీల "కళ్లు తిరుగుతున్నాయక్కయ్యా! కొంచెం మంచి నీళ్లివ్వు" అన్నాడు. మంచినీళ్లకోసం లోపలికి వెళ్లింది.

"నా కారోగ్యం తిన్నగా వుండడం లేదండీ! ఏదో మాట్లాడబోయి మరేదో మాట్లాడేస్తున్నాను" అంటూ అతడు సంజాయిషీ వివరించుకోబోయాడు.

"ఆరోగ్యంతోబాటే నీకు మనసుగూడా తిన్నగా వున్నట్టులేదు. పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నించు. అదే కుదిరిపోతుంది" అంటూ సూర్యం పడకగదిలోకి వెళ్లిపోయాడు.

పనులన్నీ ముగించుకుని సుశీల పడుకునేసరికి గంట తొమ్మిది దాటింది. చదువుతున్న పుస్తకాన్ని మూసిపెట్టి, దీపాన్ని తగ్గిస్తూ సూర్యం "ఆది కాదు సుశీలా! ఇతని వాలకమంతా ఆదోరకంగా వుంది" అన్నాడు.

"వీడంతేలెండీ! ఉన్నచోట వుండడు. ఒకరు చెబితే వినడు. నూలుతెగిన గాలిపటంలా యిలా తిరుగుతుంటాడు.

"వృద్ధాప్యంలోవున్న తల్లి దండ్రులకు యిలాటి కొడుకులు ఆరీతీరని మనోవేదన కలిగిస్తారు సుశీలా" అన్నాడు సూర్యం.

"ఆ తండ్రిగారి అదో తరహా! నగిరి కయినా నాలుగురూకలు చెల్లిస్తాను గానీ, పెద్ద కోడలికి గంజి పోయననే బాబతు మనిషాయన! ఇంట్లో వున్నంతవరకూ వీణ్ణాక మనిషిగా పరిగణించడు. తీరా దేశం పైకి వెళ్లిపోయిన తర్వాత "కనబడటం లేదు. పేరు నరహరి. వూరు.....

ఏమిటీ! ఏమన్నావ్? ఇతని పేరేమిటి" అంటూ సూర్యం లేచి కూచున్నాడు.

'నరహరండీ, నరహరి" అంది సుశీల

"అదే, అదే! నేనప్పుడే అనుకున్నాను. కానీ ఏంలాభం, నువ్వు చెప్పేంతవరకూ నిర్ధాణకు రాలేకపోయాను. ఓహో, ఇతడేనా నరహరి...." అంటూ ప్రారంభించి సూర్యం ఉదయం పత్రికలో కనిపించిన ప్రకటనను గురించి ఏకరువు పెట్టాడు.

"ఐతే యితణ్ణి బెదరగొట్టకండి. రెండు రోజులపాటు యిక్కడే నిలుపుకుని, వాళ్లనాన్న గారికీ టెలిగ్రామిచ్చేద్దాం" అంది సుశీల.

బహుమానాన్ని గురించిన మధుర స్మృతుల్లో మునిగి తేలుతూ "మీ సుబ్బరామయ్య బాబాయి ఆడిన మాటను నిలబెట్టుకునే రకమేనా సుశీలా అని ప్రశ్నించాడు సూర్యం.

"చెప్పానుగదండీ! దండగ ఖర్చులు చేయడంలో ఆయన కాయనే సాటి" అంది సుశీల.

◆ ◆ ◆

మరునాటి ఉదయం సూర్యం ఆఫీసులో అడుగుబెట్టేసరికి, అతని సహోద్యోగులందరూ మాములు ప్రకారం పత్రిక చదువుకుంటున్నారు.

"కాసేపు మీరందరూ నావైపు చూడండి. మీకో వర్తమానం చెబుతాను" అన్నాడు సూర్యం.

"ఏమిటది?" అన్నాడు శర్మ.

"నిన్న రాత్రి మా యింటికో అతిథి వచ్చాడు. తొలి చూపుతోనే నతడెవరో గుర్తుపట్టలేకపోయాననుకోండీ! కానీ చివరి కెలాగైతేనేం, అతడు నరహరనీ, స్వగ్రామం కాకినాడనీ తెలుసుకోగలిగాను....."

"అరరే, కంగ్రాజులేషన్స్ మిస్టర్ సూర్యం! నీ అదృష్టం పండిందన్నమాటే! టెలిగ్రామిచ్చేశావు గదా!" అన్నాడు మూర్తి టేబిలుపై నుంచీ క్రిందికి దూకుతూ.

"ఇవ్వాలనే అనుకున్నాను. కానీ పర్సు కనబడుటలేదు."

"ఆరరే, పెద్ద చిక్కే ఎదురైందే మరీ! పోనీ, ఒకటో రెండో చేబదులు తీసుకో" సలహా యిచ్చాడు శర్మ.

"చేబదులు దొరక్కగాదు, విచారకరమైన విషయం అది యేమిటంటే పర్సుకంటే ముందుగా అతడు గూడా కనబడుటలేదు".

"నీ దుస్థితికి చాలా చింతిస్తున్నాను సూర్యం! ఈ వారం నీకు ధనహాని వుంటుందని చెప్పనే చెప్పానుగదా!" -వారఫలాల్ని నెమరుకు తెచ్చుకుంటూ అన్నాడు శాస్త్రి!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 13-11-195)

❀ ❀ ❀